# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆంధ్రప్రదేశ్ ను లాజిస్టిక్స్ హబ్ గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- ❖ అభివృద్ధిలో స్థిరత్వం ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.
- ❖ వైఎస్సార్ కడప జిల్లాలో అధునాతన స్మార్ట్ కిచెన్లను విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ ఈ రోజు ప్రారంభించారు.
- ❖ వాయవ్య బంగాళాఖాతంలో ఈరోజు ఉదయం అల్పపీడనం ఏర్పడిందని భారత వాతావరణం కేంద్రం వెల్లడించింది.

============================

ఆంధ్రప్రదేశ్ ను లాజిస్టిక్స్ హబ్ గా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ చేపడుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఈ రోజు జరిగిన ఈస్ట్ కోస్ట్ మారీటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా మారుతుందని, భవిష్యత్‌లో రహదారులు, రైలు కనెక్టివిటీ, జల రవాణా, ఎయిర్ లాజిస్టిక్స్ పెరుగుతాయిని పేర్కొన్నారు. రహదారుల అనుసంధానం జరిగినట్లు, నదుల అనుసంధానం కూడా జరగాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 6 పోర్టులున్నాయని, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. ప్రతి 50 కిలోమీటర్ల దూరానికి ఒక పోర్టు ఉండేలా చూస్తామని ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ 38 సెకన్లు)

============================

ఎరువులు నల్ల బజారుకు తరలకుండా కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఉద్యాన పంటలు, ఎరువుల లభ్యత, మార్కెటింగ్ శాఖపై ముఖ్యమంత్రి ఈ రోజు క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ... ఈ సంవత్సరం రెండు లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఎరువులు రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. ఈ క్రాప్ ద్వారా పంట సాగు, ఎరువుల వినియోగం వివరాలను లెక్కించాలని అధికారులకు సూచించారు. కాఫీ తోటలకు కొత్తగా వచ్చిన తెగుళ్లపై తక్షణమే చర్యలు చేపట్టాలని, ఇతర ప్రాంతాలకు తెగుళ్లు వ్యాపించకుండా వెంటనే అరికట్టాలన్నారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

===========================

నీతి ఆయోగ్ ఆకాంక్షిత జిల్లాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే కేంద్రప్రభుత్వ సంపూర్ణత అభియాన్ కార్యక్రమం లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ రోజు  నిర్వహించిన "సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్" కార్యక్రమంలో స్థానిక పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని రెండు ఆకాంక్షిత మండలాలకు సంపూర్ణత అభియాన్ పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... విద్యా, ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, సామాజిక సంక్షేమ రంగాలలో నిర్దేశించిన జిల్లాలను నూరు శాతం అభివృద్ధి చేసేందుకు సంపూర్ణత అభియాన్ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధిలో స్థిరత్వం ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. సరైన ప్రణాళికలు రూపొందించి, సమర్థవంతంగా అమలు చేస్తే మరింత ప్రగతి సాధించవచ్చని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

===========================

ఈ ఏడాది డిసెంబర్ నాటికి వైఎస్సార్ కడప జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో 33 అధునాతన స్మార్ట్ కిచెన్లు ప్రారంభిస్తామని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. వీటి ద్వారా 1,24,689 మంది విద్యార్థులకు ఆహారం అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. సీకేదిన్నె మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధునాతన స్మార్ట్ కిచెన్‌ను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. అనంతరం కమలాపురం నియోజక వర్గంలో పెండ్లిమర్రి మండలంలో 12 కోట్ల రూపాయల రుసా నిధులతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనానికి ప్రారంభోత్సవం చేశారు. అదేవిధంగా యోగి వేమన విశ్వ విద్యాలయంలో పీఎం ఉషా పథకంలో భాగంగా 10 కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఆడిటోరియం భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు.

విరామం

===========================

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కాఫీ హౌస్ లో 90 శాతం రాయితీపై రాజ్మా విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నే సుబ్బారెడ్డి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం నిర్ణయించిన ధరలో రైతులు కేవలం 10 శాతం మాత్రమే చెల్లించి విత్తనాలు పొందవచ్చని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాలలో సేంద్రీయ పంటలు పండించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. గిరిజన పంట ఉత్పత్తులకు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

===========================

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ఏలూరు జిల్లా చింతలపూడి మండల పరిధిలోని తమ్మిలేరు జలాశయానికి భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఏలూరు రూరల్, అర్బన్ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలను జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ తో కలిసి కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఈ రోజు పరిశీలించారు. నగరంలోని నదీ పరివాహక ప్రాంతాలైన శనివారపుపేట కాజ్ వే, బాలయోగి వంతెన, తంగెళ్ళమూడి వంతెన తదితర ప్రాంతాల్లో పర్యటించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని, నదీతీరం నదిగట్ల పటిష్టతను ప్రత్యక్షంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ్మిలేరుకు వరద ఉధృతి దృష్ట్యా ముంపు గ్రామాలను అప్రమత్తం చేశామని కలెక్టర్ పాత్రికేయులకు తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

============================

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఈ రోజు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ఈనెల 5 నుండి 7వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. పవిత్రోత్సవాల ముందు మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామాగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. ఈ కారణంగా ఆర్జితసేవలైన కల్యాణోత్సవం, ఊంజల్ సేవను తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) రద్దు చేసింది.

============================

వాయవ్య బంగాళాఖాతంలో ఈరోజు ఉదయం అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. ఒడిశా పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో బలమైన రుతుపవనాల ద్రోణి కొనసాగుతోంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఉత్తర కోస్తాలో ఒకటి రెండు చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడన ప్రభావం సుమారు రెండు రోజుల పాటు కొనసాగుతోందని వాతావరణ కేంద్రం అధికారిణి జి. లక్ష్మి వెల్లడిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

============================

గోదావరి నది తీరం అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి అధికారులకు సూచించారు. గోదావరి గట్టున 8 కోట్ల రూపాయాలతో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆమె ఈ రోజు పరిశీలించారు. సందర్శకులకు ఇబ్బంది లేకుండా, ఆహ్లాదకరంగా ఉండేలా సుందరంగా తీర్చిదిద్దేలా పనులు చేపట్టాలన్నారు.

============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిసాయి. ఉదయం సెన్సెక్స్.. 80,364 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరకు 206 పాయింట్ల నష్టంతో 80,158 వద్ద ముగిసింది. నిఫ్టీ 45 పాయింట్లు తగ్గి 24,579 వద్ద స్థిరపడింది.

============================
============================